# వరలక్ష్మీ వ్రతకల్పము

ఇంటిలో ఈశాన్య మూలలో స్థలమును శుద్ధి చేసి, అలికి, బియ్యపు పిండితోగాని, రంగుల చూర్ణములతో గాని, ముగ్గులు పెట్టి, దైవస్థాపన నిమిత్తమై ఒక పీటను వేయాలి. పీట మరీ ఎత్తుగాగాని, మరీ పల్లముగా గానీ ఉండకూడదు. పిదప ఆ పీటకు కూడా చక్కగా పసుపురాసి, కుంకుమతో బొట్టుపెట్టి, వరి పిండి (బియ్యపుపిండి) తో ముగ్గు వేయాలి. సాధారణంగా అష్టదళపద్మాన్నే వేస్తారు. పూజ చేసేవారు తూర్పుముఖంగా కూర్చోవాలి. ఏ దైవాన్ని పూజింజబోతున్నారో ఆ దైవంయొక్క ప్రతిమనుగాని, చిత్రపటమునుగాని ఆ పీటపై ఉంచాలి. ముందుగా పసుపుతో గణపతిని తయారు చేసి (పసుపును షుమారు అంగుళం సైజులో త్రికోణ ఆకృతిలో ముద్దగాచేసి), దానికి కుంకుమ బొట్టు పెట్టి, పిదప ఒక పళ్ళెంలోగాని, క్రొత్త తుండుగుడ్డమీదగాని బియ్యం పోసి దానిపై ఒక తమలపాకునుంచి, అందు పసుపు గణపతినుంచి అగరువత్తులు వెలిగించాలి. (ఏ దేవునికి సంబంధించిన వ్రతము చేయుచున్నను ముందు గణపతిని పూజించి పిమ్మట ఆ దేవుని పూజించవలెను) దీపారాధన నైఋుతి దిశలో చేయవలెను. ఇపుడు ఈ వరలక్ష్మీ పూజకు కావలసిన వస్తువులను అమర్చుకోవాలి.

**పూజకు కావలసిన వస్తువులు-దీపారాధన విధానము** :దీపారాధన చేయుటకు కుంది (ప్రమిద) వెండిదిగాని, ఇత్తడిదిగాని, మట్టిదిగాని వాడవచ్చును. కుందిలో 3 అడ్డవత్తులు 1 కుంభ వత్తి (మధ్యలో) వేసి నూనెతో తడుపవలెను. ఇంకొక అడ్డవత్తి నూనెతో తడిపి ఏకహారతిలో (కర్పూర హారతికి వాడే వస్తువు) వేసి ముందుగా ఏకహారతిలో వేసిన వత్తిని అగ్గిపుల్లతోవెలిగించి,వెలిగించినవత్తితోకుందిలోని1అడ్డవత్తి 1 కుంభవత్తి వెలిగించవలెను. తర్వాత చేయి కడుక్కొని నూనె కుంది నిండావేసి పిదప ఆ కుందికి మూడు చోట్ల కుంకుమఅలంకారముచేయవలెను.తర్వాతఅక్షతలువేసిదీపారాధనములక్ష్మీస్వరూపముగా భావించి నమస్కారము చేయవలెను. కుందిలో మిగిలిన రెండు అడ్డవత్తులు పూజా సమయంలో ధూపము చూపిన తరువాత దీపము చూపించుటకు వాడవలెను. దీపారాధనకు నువ్వులనూనెగాని, కొబ్బరినూనెగాని, ఆవునెయ్యిగాని వాడవచ్చును. మనముఆచమనముచేసినటువంటిపంచపాత్రలోనినీళ్లుదేవునిపూజకువినియోగించరాదు. పూజకు విడిగా ఒకగ్లాసుగాని, చెంబుగాని తీసుకొని దానిలో శుద్ధ జలమును పోసి ఆ చెంబునకు కలశారాధన చేసి ఆ నీళ్లు మాత్రమే దేవుని పూజకు ఉపయోగించవలెను.

# వరలక్ష్మీ వ్రతకల్పము

**శ్రీ వరలక్ష్మీ వ్రతమునకు తీసుకొనవలసిన ముఖ్య వస్తువులు :** వరలక్ష్మీదేవి బొమ్మ (శక్త్యనుసారముగా బంగారు కాని వెండికాని) లేదా చిత్రపటము, వరలక్ష్మీదేవిని కొందరు కొబ్బరికాయకు పసుపు పూసి, బొట్టుపెట్టి కలశంపై పెట్టి పూజిస్తారు. మరికొందరు ఈవిధంగా తయారుచేసి పూజిస్తారు. కొబ్బరికాయకు పీచు తీసి కాయను బాగా గీకి నున్నగా చేసి, తొడిమను పైకి వచ్చేలా వుంచుకొని, పసుపు రాసి గోధుమ, మైదా లేదా పసుపుముద్దతో చేసిన ముక్కు, చెవులు అమర్చి, కాటుకను పుల్లతో తీసుకొని కళ్ళు, కనుబొమలను గీసి, కళ్ల లోపల నానబెట్టిన సుద్దముక్కతో తెలుపురంగు గీసి మరల కనుపాపకు కాటుకను మధ్యలో గుండ్రముగా పెట్టి, నోరు తిలకముతో గాని లిప్‌స్టిక్‌తో గాని పెట్టి, ఈ బొమ్మను పెద్ద చెంబుపైగాని, బిందెపైగాని అమర్చుతారు. కొత్త జాకెట్టు గుడ్డను త్రిభుజాకారములో మడచి పైన తొడిమకు తొడుగుతారు. కొత్త చీరను కట్టి, ఆభరణములతో అలంకరించి ఈవిధంగా చేసిన బొమ్మను వరలక్ష్మీదేవిగా భావించి పూజిస్తారు.

**ఇంకను పూజకు కావలసిన వస్తువులు :** పూజకు బంగారుకాని, వెండితోకాని చేసిన కాసు (దీనిని కొందరు ప్రతి సంవత్సరము కొత్తది తీసుకొని దేవివద్ద వుంచి పూజిస్తారు. కొందరు ఒకసారి తీసుకున్నదే ప్రతి సంవత్సరము దేవివద్ద వుంచి పూజిస్తారు) ధూపమునకు సాంబ్రాణి, అగరుబత్తి, దీపారాధనకు కుందిలు, అగ్గిపెట్టె, ఆవునెయ్యి, పత్తితో చేసిన వత్తులు మరియు అక్షతలు (పసుపుతో కలిపిన బియ్యం కొద్దిగా), పసుపు, కుంకుమ, పువ్వులు, గంధం, హారతి కర్పూరము, పళ్లు, కొబ్బరికాయలు, తోరములు (దారమును తొమ్మిది వరుసలుగా తీసి పసుపు రాసి తొమ్మిది చోట్ల పువ్వులతో తొమ్మిది ముడులు వేసి సిద్ధముగా వుంచుకొనవలెను. నివేదనకు స్త్రీదేవతారాధనకు ప్రత్యేకంగా చలిమిడి (బియ్యంపిండి, బెల్లంతో చేస్తారు) పానకం (శుద్ధమైన నీటిలో బెల్లం కలిపి ఏలక్కాయ పొడి, మిరియాల పొడి కొద్దిగా కలుపుతారు) మహానైవేద్యము కొరకు మంచి భక్ష్యములతో కూడిన భోజనము. తొమ్మిది రకాల పిండివంటలను తయారుచేసి నైవేద్యము పెట్టిన తరువాత తొమ్మిది రకముల పిండివంటలు రకమునకు తొమ్మిది చొప్పున పళ్ళెములో వుంచి, దానిపై తోరమును, తాంబూలమును (3 తమలపాకులు, వక్క, పండు, పువ్వులు) పెట్టి ముత్తైదువునకు వాయనము ఇవ్వవలెను (శక్తి వున్నవారు జాకెట్టుగుడ్డ కూడ పెట్టవచ్చును).వ్రతము పూర్తి అయిన తరువాత ఆరోజు సాయంత్రము వీలైనచో కొందరుముత్తైదువలను పిలిచి తాంబూలము ఇస్తారు.

ఇవన్నియుఅమర్చుకొనినతరువాతపూజకు సిద్ధము చేసుకొనిన పిమ్మట యజమానులు (పూజచేసేవారు) ఈ దిగువ కేశవనామాలను స్మరిస్తూ ఆచమనం చేయాలి. ఈ నామములు మొత్తం 24 కలవు.

1. 'ఓం కేశవాయ స్వాహా' అని చెప్పుకుని చేతిలో నీరు తీసుకొని లోనికి తీసుకోవాలి.

2. 'ఓం నారాయణాయ స్వాహా' అనుకుని ఒకసారి

3. 'ఓం మాధవాయ స్వాహా' అనుకుని ఒకసారి జలమును పుచ్చుకోవలెను. తరువాత

4. 'ఓం గోవిందాయ నమః' అని చేతులు కడుగుకోవాలి.

5. 'విష్ణవే నమః' అనుకుంటూ నీళ్ళు త్రాగి, మధ్య వ్రేలు, బొటనవ్రేళ్లతో కళ్లు తుడుచుకోవాలి.

6. 'ఓం మధుసూదనాయ నమః' అని పై పెదవిని కుడినుంచి ఎడమకి నిమురుకోవాలి.

7. 'ఓం త్రివిక్రమాయ నమః' క్రింది పెదవిని కుడినుంచి ఎడమకి నిమురుకోవాలి.

8,9. 'ఓం వామనాయ నమః' 'ఓం శ్రీధరాయ నమః' ఈ రెండు నామాలు స్మరిస్తూ తలపై కొంచెం నీళ్లు చల్లుకోవాలి.

10. ఓం హృషీకేశాయ నమః ఎడమ చేతితో నీళ్లు చల్లాలి.

11. ఓం పద్మనాభాయ నమః పాదాలపై ఒక్కొక్క చుక్క నీరు చల్లుకోవాలి.

12. ఓం దామోదరాయ నమః శిరస్సుపై జలమును ప్రోక్షించుకోవలెను.

13. ఓం సంకర్షణాయ నమః చేతివ్రేళ్లు గిన్నెలా వుంచి గడ్డము తుడుచుకోవలెను.

14. ఓం వాసుదేవాయ నమః వ్రేళ్లతో ముక్కును వదులుగా పట్టుకోవలెను.

15,16. ఓం ప్రద్యుమ్నాయ నమః ఓం అనిరుద్ధాయ నమః నేత్రాలు తాకవలెను.

17,18. ఓం పురుషోత్తమాయ నమః ఓం అధోక్షజాయ నమః రెండు చెవులూ తాకవలెను.

19,20. ఓం నారసింహాయ నమః ఓం అచ్యుతాయ నమః బొడ్డును స్పృశించవలెను.

21. ఓం జనార్దనాయ నమః చేతివ్రేళ్లతో వక్ష స్థలం, హృదయం తాకవలెను.

22. ఓం ఉపేంద్రాయ నమః చేతి కొనతో శిరస్సు తాకవలెను.

23,24. ఓం హరయే నమః ఓం శ్రీకృష్ణాయ నమః
కుడి మూపురమును ఎడమ చేతితోను, ఎడమ మూపురమును కుడిచేతి ఆచమనము చేసిన తరువాత వెంటనే సంకల్పము చెప్పుకోవలెను.

ఆచమనము అయిన తరువాత, కొంచెం నీరు చేతిలో పోసుకుని నేలపై చిలకరించుతూ ఈ శ్లోకము పఠించవలెను.

శ్లో॥ ఉత్తిష్ఠంతు భూత పిశాచాః యేతే భూమిభారకాః
యేతేషామవిరోధేన బ్రహ్మకర్మ సమారభే ॥

ప్రాణాయామమ్య : ఓం భూః - ఓం భువః ఓం సువః - ఓం మహః - ఓం జనః ఓం తపః - ఓగ్ ం సత్యం - ఓం తత్ సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహీధియోయోనః ప్రచోదయాత్- ఓం ఆపోజ్యోతిరసోమృతం బ్రహ్మ భూర్భువస్సువరోం అని సంకల్పము చెప్పుకొనవలెను.

సంకల్పము : మమ ఉపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ముద్దిశ్య శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం శుభే శోభన ముహూర్తే ఆద్య బ్రహ్మణః (ఇక్కడ శ్రీ మహావిష్ణో రాజ్ఞయా అని కూడా చెప్పవచ్చు) ద్వితీయ పరార్థే శ్వేత వరాహ కల్పే వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమపాదే జంబూ ద్వీపే భరతవర్షే భరత ఖండే మేరోర్దక్షిణ దిగ్భాగే శ్రీశైలస్య ఈశాన్య ప్రదేశే (మనకు శ్రీశైలము ప్రధాన క్షేత్రము కావున మనము శ్రీశైలమునకు ఏ దిక్కున ఉన్నామో ఆ దిక్కు చెప్పుకొనవలెను), కృష్ణా గోదావర్యోః మధ్యప్రదేశే(మనంఏఏనదులకుమధ్యనఉన్నామోఆయానదుల పేర్లుచెప్పుకొనవలెను), శోభన గృహే (అద్దె ఇల్లు అయినచో వసతిగృహే అనియు,సొంత ఇల్లయినచో స్వగృహే అనియు చెప్పుకొనవలెను), సమస్తదేవతా బ్రాహ్మణ హరిహర సన్నిధౌ అస్మిన్ వర్తమానే వ్యావహారిక చాంద్రమానేన .......సంవత్సరే, (ఇక్కడ తెలుగు సంవత్సరమను అంటే పూజ చేయునపుడు ఏ సంవత్సరము జరుగుచున్నదో ఆ సంవత్సరము యొక్క పేరునుచెప్పుకోవలెను)......అయనే,(సంవత్సరమునకురెండుఅయనములు-ఉత్తరాయణము, దక్షిణాయనము. జనవరి 15 మకర సంక్రమణం మొదలు జూలై 14 కర్కాటక సంక్రమణం వరకు ఉత్తరాయణము, జూలై15 కర్కాటక సంక్రమణం నుండి మరల జనవరి 14 పెద్దపండుగ అనగా మకర సంక్రమణం వరకు దక్షిణాయనం. పూజచే యునపుడు ఏ అయనము జరుగుచున్నదో దానిని చెప్పవలెను)... ఋతుః, (వసంత, గ్రీష్మ, వర్ష మొ॥ ఋతువులలో పూజ సమయములో జరుగుచున్న ఋతువుపేరు).... మాసే,(చైత్ర,వైశాఖమొ॥పన్నెండుమాసములలో పూజ సమయములో జరుగుచున్న మాసం పేరు) .....పక్షే, (నెలకు రెండు పక్షములు పౌర్ణమికి ముందు శుక్లపక్షము, అమావాస్యకు ముందు కృష్ణపక్షములు వీటిలో పూజ జరుగుచున్న సమయమున గల పక్షము పేరు) .....తిథౌ, (ఆరోజు తిథి)....వాసరే(ఆరోజుఏ వారమనదీ చెప్పుకొని) శుభనక్షత్రే, శుభయోగే,

# వరలక్ష్మీ వ్రతకల్పము

శుభకరణేఏవంగుణవిశేషణవిశిష్టాయాంశుభతిథౌమమఉపాత్త సమస్త దురితక్షయద్వారా శ్రీ పరమేశ్వర ముద్దిశ్య శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం పురుషులైనచో శ్రీమాన్ ....... గోత్రస్య..... నామధేయః, శ్రీమత్యః, గోత్రస్య, నామధేయస్య అనియు, స్త్రీలైనచో శ్రీమతి, గోత్రవతి, నామధేయవతి, శ్రీమత్యాః, గోత్రవత్యాః, నామధేయవత్యాః అనియు (పూజచేయువారి గోత్రము, నామము చెప్పి) నామధేయస్యః ధర్మపత్నీ సమేతస్య (పురుషులైనచో) మమ సహకుటుంబస్య, క్షేమ స్థైర్య వీర్య విజయ అభయ ఆయురారోగ్య ఐశ్వర్యాభి వృద్ధ్యర్థం, మమ ధర్మార్థ కామమోక్ష చతుర్విధ ఫలపురుషార్థ సిద్ధ్యర్థం, పుత్రపౌత్రాభి వృద్ధ్యర్థం సకలవిధ మనోవాంఛాఫలసిద్ధ్యర్థం, సర్వాభీష్ట సిద్ధ్యర్థం అని (స్త్రీలు మాత్రము పూజ చేసుకొనునపుడు) అఖండిత సర్వవిధ సుఖసౌభాగ్య సంతతి ఆయుః ఆరోగ్య ఐశ్వర్యాః అభివృద్ధ్యర్థం అని (దంపతులు కూర్చొని చేసుకొనునపుడు) శ్రీ వరలక్ష్మీ దేవతా ముద్దిశ్య వరలక్ష్మీ దేవతా ప్రీత్యర్థం (ఏ దేవుని పూజించుచున్నామో ఆ దేవునియొక్క పేరు చెప్పుకొని) కల్పోక్త ప్రకారేణ యావచ్ఛక్తి (నాకు తోచిన రీతిలో, నాకు తోచిన నియమములతో, నాకు తోచినవిధముగా, భక్తి శ్రద్ధలతో సమర్పించుకొంటున్న పూజ) ధ్యానావాహనాది షోడశోపచార పూజాం కరిష్యే. తదంగ కలశపూజాం కరిష్యే ॥ పిదప కలశారాధనను చేయవలెను.

కలశపూజను గూర్చిన వివరణ : వెండి, రాగి, లేక కంచు గ్లాసులు (లేదా పంచపాత్రలు) రెండింటిలో శుద్ధ జలమును తీసుకొని ఒకదానియందు ఉద్ధరిణిని, రెండవదానియందు అక్షతలు, తమలపాకు, పువ్వు ఉంచుకొనవలెను. రెండవపాత్రకు బయట మూడు వైపులా గంధమును వ్రాసి కుంకుమను అద్దవలెను. ఇట్లు చేయునపుడు గ్లాసును గుండ్రముగా త్రిప్పుచూ గంధమును గాని, కుంకుమనుగాని పూయరాదు. గంధమును ఉంగరపు వేలితో పూయవలెను. కుంకుమ అక్షతలు వగైరా బొటన, మధ్య,ఉంగరపు వ్రేళ్లను కలిపి సమర్పించవలెను. యజమానులు (ఒక్కరైతే ఒకరు, దంపతులైతే ఇద్దరూను) ఆ కలశాన్ని కుడిచేతితో మూసివుంచి, ఇలా అనుకోవాలి. ఈ విధముగా కలశమునుతయారుచేసి పూజను చేయునపుడు మొదటగా ఈ శ్లోకమును చదువవలెను.

మం॥ కలశస్య ముఖే విష్ణుః కంఠే రుద్రస్సమాశ్రితః
మూలే తత్ర స్థితో బ్రహ్మామధ్యేమాతృ గణాస్మృతాః ॥
ఋగ్వేదో థ యజుర్వేదస్సామవేదోహ్యథర్వణః
అంగైశ్చ సహితాస్సర్వే కలశాంబు సమాశ్రితాః

శ్లో॥ గంగైచ యమునేచైవ గోదావరి, సరస్వతీ,నర్మదా సింధు కావేర్యా జలేస్మిన్ సన్నిధిం కురు ॥

అనే ఈ శ్లోకమును చదువుకొని ఈక్రిందివిధంగా పూజించవలెను.ఏవం కలశ పూజాం కుర్యాత్. పూజార్థం మమ దురితక్షయకారకాః కలశోదకేన ఓం దేవం సంప్రోక్ష్య (కలశమందలి ఉదకమును దేవునిపై చల్లాలి), ఓం ఆత్మానం సంప్రోక్ష్య అని (ఆ నీటిని తనపై చల్లుకోవాలి) ఓం పూజా ద్రవ్యాణి సంప్రోక్ష్య (పూజాద్రవ్యములపై కూడా చల్లాలి) కలశమందలి నీటిని పై మంత్రం చదువుతూ పువ్వుతోగాని, ఆకుతోగానీ చల్లాలి.

మార్జనము : ఓం అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాంగతోపివా

యస్స్మరేత్పుండరీకాక్షం సబాహ్యాభ్యంతరశ్శుచిః

అని పిదప కాసిన అక్షతలు, పసుపు శ్రీవరలక్ష్మీ దేవి ప్రతిమపై వేసి, ఆమెను తాకి నమస్కరించవలెను.

ప్రార్థన : శ్లో॥ పద్మాసనే పద్మకరే సర్వలోకైక పూజితే

నారాయణప్రియే దేవి సుప్రీతా భవ సర్వదా

శ్రీ వరలక్ష్మీదేవతాయైనమః ప్రార్థనా నమస్కారం సమర్పయామి అని దేవికి నమస్కరించవలెను.

ధ్యానము : శ్లో॥ క్షీరోదార్ణవ సంభూతే కమలే కమలాలయే

సుస్థిరాభవమేగేహే సురాసుర నమస్కృతే

శ్రీ వరలక్ష్మీదేవతాయైనమః ధ్యానం సమర్పయామి అని దేవినిమనస్ఫూర్తిగా ధ్యానించవలెను.

అంకుశంచాక్షసూత్రంచ పాశం వీణాంచ ధారిణీమ్ ముకాహార సమాయుక్తం మోదరూపాం మనోహరామ్సితేన దర్పణాభేన వస్త్రేణో పరిభూషితాః సుస్తనే వేదవేద్యాంచ చంద్రార్థకృత శేఖరామ్జటాకలాసంయుక్తాం పూర్ణచంద్ర నిభాననామ్ త్రిలోచనాం మహాదేవీ స్వర్ణ నూపుర ధారిణీమ్కటకై స్వర్ణరత్నా ద్యైర్ముక్తావలయ భూషితాం, కంబుకంఠీంసుతామ్రోష్ఠీం సర్వాభరణ భూషితామ్కేయూరైర్మేఖలాద్యైశ్చ ద్యోతయంతీ జగత్రయమ్ శబ్ద బ్రహ్మాత్మికాం దేవీ ధ్యాన కర్మ సమాహితః ఓం శ్రీ వరలక్ష్మీ దేవ్యైనమః ధ్యాయామి అని శ్రీ వరలక్ష్మీదేవిని ధ్యానం చేయవలెను.పిమ్మట షోడశోపచార పూజ చేయవలెను.

షోడశోపచారములనగా ఆవాహన, ఆసనం, అర్ఘ్యం, పాద్యం, ఆచమనీయం, స్నానం, వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలం, నమస్కారం, ప్రదక్షిణములు మొదలగునవి.

షోడశోపచారపూజా ప్రారంభః

ఆవాహనం : శ్లో॥ సర్వమంగళ మాంగల్యే విష్ణువక్షఃస్థలాలయే.
ఆవాహయామి దేవీ త్వాం సుప్రీతా భవసర్వదా ॥

శ్రీ వరలక్ష్మీ దేవతాం ఆవాహయామి అని వరలక్ష్మీదేవిని మనస్ఫూర్తిగా లోనికి స్వాగతం పలుకుతున్నట్లుగా తలచి, ఆహ్వానించవలెను (నమస్కరించవలెను)

ఆసనం : శ్లో॥ సూర్యాయుత నిభస్ఫూర్తే స్ఫురద్రత్న విభూషితే,
సింహాసనమిదం దేవీ స్వీయతాం సురపూజితే ॥

శ్రీ వరలక్ష్మీ దేవతాం ఆసనం సమర్పయామి అని కూర్చొనుటకు ఆసనం ఇచ్చునట్లు భావించి దేవిపై పువ్వులు, పసుపు, కుంకుమను చల్లవలెను.

పాద్యం : శ్లో॥ సువాసితజలం రమ్య సర్వతీర్థసముద్భవం,
పాద్యం గృహాణ దేవీ త్వం సర్వదేవ నమస్కృతే ॥

శ్రీ వరలక్ష్మీ దేవతాం పాద్యం సమర్పయామి అని కాళ్లు కడుగుకొనుటకు నీళ్లు ఇస్తున్నట్లుగా భావించి ఉద్ధరిణెతో పంచపాత్రలోని జలమును వరలక్ష్మీదేవిపై చల్లి, రెండు చుక్కలు జలము వేరొక పాత్రలోనికి వదలవలెను. అరివేణంలో వేయరాదు.

అర్ఘ్యం : శ్లో॥ శుద్ధోదకం చ పాత్రస్థం గంధపుష్పాది మిశ్రితం,
అర్ఘ్యం దాస్యామి తే దేవీ గృహాణ సురపూజితే. ॥

శ్రీ వరలక్ష్మీ దేవతాం అర్ఘ్యం సమర్పయామి అని చేతులను కడుగుకొనుటకు కూడా నీరు ఇచ్చుచున్నట్లు భావిస్తూ పంచపాత్రలోని జలమును పువ్వుతో వరలక్ష్మీ దేవిపైన చల్లి, అర్ఘ్య పాత్రలో రెండు చుక్కలు వదలవలెను.

ఆచమనీయం : శ్లో॥ సువర్ణకలశానీతం చందనాగరుసంయుతం,
గృహాణచమనం దేవి మయా దత్తం శుభప్రదే ॥

శ్రీ వరలక్ష్మీ దేవతాం ఆచమనీయం సమర్పయామి అని దేవి ముఖము శుభ్రము చేసుకొనుటకు నీరు ఇచ్చునట్లు భావించి జలమును వేరొక పాత్రలోనికి వదలవలెను. అరివేణంలో వదలరాదు. దీనినే మంచినీరు దాహము తీర్చుకొనుటకు ఇచ్చునట్లుగా భావించవలెను.

# వరలక్ష్మీ వ్రతకల్పము

సూచన : అర్ఘ్యం, పాద్యం, ఆచమనం మొదలగు వాటికి ఉద్ధరిణెతో నీరు వేరొక పాత్రలో వదలవలెను. అరివేణంలోవదలరాదు.

పంచామృతస్నానం : శ్లో॥ పయోదధిఘృతోపేతం శర్కరామధుసంయుతం,
పంచామృతస్నాన మిదం గృహాణ కమలాలయే ॥

శ్రీ వరలక్ష్మీ దేవతాం పంచామృత స్నానం సమర్పయామి అని స్నానమునకు పంచామృతములతో కూడిన నీరు ఇచ్చునట్లు భావించి ఆవునెయ్యి, ఆవుపాలు, ఆవు పెరుగు, తేనె, పంచదార కలిపిన పంచామృతమును దేవిపై ఉద్ధరిణెతో చల్లవలెను.

శుద్ధోదక స్నానం : శ్లో॥ గంగాజలం మయానీతం మహాదేవ శిరఃస్థితం,
శుద్ధోదకమిదం స్నానం గృహాణ విధుసోదరీ ॥

శ్రీ వరలక్ష్మీ దేవతాం శుద్ధోదకస్నానం సమర్పయామి అని పంచపాత్రలోని శుద్ధ నీటిని పువ్వుతో దేవిపై చల్లవలెను.

వస్త్రయుగ్మం : శ్లో॥ సురార్చితాంఘ్రియుగళే దుకూలవసనప్రియే,
వస్త్రయుగ్మం ప్రదాస్యామి గృహాణ హరివల్లభే ॥

శ్రీ వరలక్ష్మీ దేవతాం వస్త్రయుగ్మం సమర్పయామి అని పట్టు లేదా శక్తికి తగిన శుభ్రమైన వస్త్రములను దేవికి ఇస్తున్నట్లుగా భావించి ముందుగా తయారుచేసుకొన్న ప్రత్తితో చేసిన వస్త్రయుగ్మమును (ప్రత్తిని గుండ్రని బిళ్లగా చేసి తడి చేత్తో పసుపు, కుంకుమ తీసుకొని రెండువైపులా అద్ది రెండు తయారుచేసుకోవాలి) శ్రీ వరలక్ష్మీదేవికి కలశంపై ఎడమవైపు వేయవలెను.

ఆభరణాని : శ్లో॥ కేయూరకంకణైర్దవ్యై ర్హారనూపులమేఖలాః,
విభూషణాన్యమూలాని గృహాణ ఋషిపూజితే ॥

శ్రీ వరలక్ష్మీ దేవతాం ఆభరణాని సమర్పయామి అని కొత్తగా కొన్న లక్ష్మీరూపును, ఇంకను బంగారు కాని వెండికాని ఆభరణములను (శక్తి అనుసారము) దేవికి సమర్పించవలెను. అవి లేనిచో పసుపు, కుంకుమ, అక్షతలు వేసి నమస్కరించవలెను.

ఉపవీతం : శ్లో॥ తప్త హేమకృతంసూత్రం ముక్తాదామ విభూషితం,
ఉపవీతమిదం దేవి గృహాణ త్వం శుభప్రదే ॥

శ్రీ వరలక్ష్మీ దేవతాం ఉపవీతం సమర్పయామి అని ప్రత్తిని మూడు లేదా నాలుగు అంగుళములు పొడవుగా మధ్య మధ్యలో పసుపుతో అద్దుతూ నలిపిన యజ్ఞోపవీతమును దేవికి సమర్పించవలెను.

గంధం : శ్లో॥ కర్పూరాగరుకస్తూరీ రోచనాదిభిరన్వితం,
గంధం దాస్యామ్యహం దేవి ప్రీత్యర్థం ప్రతిగృహ్యతాం ॥

శ్రీ వరలక్ష్మీ దేవతాం గంధం సమర్పయామి అని కుడిచేతి బొటనవ్రేలు, మధ్యవ్రేలుతో గంధం తీసుకొని దేవిపై మూడు నాలుగు చుక్కలు పడునట్లుగా చల్లవలెను.

అక్షతాన్ : శ్లో॥ అక్షతాన్ దవళాన్ దివ్యాన్ శాలీయాన్ స్తండులాన్ శుభాన్,
హరిద్రా కుంకుమో పేతాన్ గృహ్యతా మబ్ధిపుత్రికే ॥

శ్రీ వరలక్ష్మీ దేవతాం అక్షతాన్ సమర్పయామి అని అక్షతలను (పసుపు కలిపిన బియ్యమును) దేవిపై చల్లవలెను.

పుష్ప పూజ : శ్లో॥ మల్లికాజాజికుసుమై శ్చంపకై ర్వకుళై స్తథా,
నీలోత్పలైశ్చకల్హారై: పూజయామి హరిప్రియే.

శ్రీ వరలక్ష్మీ దేవతాం పుష్పై: పూజయామి అని అన్ని రకముల పూవులతో దేవిని పూజించవలెను. ఈ షోడశోపచార పూర్తి అయిన తరువాత అథాంగపూజ చేయవలెను.

**అథాంగ పూజ**

కుడిచేతిలోనికి కొన్ని అక్షతలను తీసుకొని క్రింది నామములను చదువుతూ అక్షతలను దేవిపై చల్లవలెను. పసుపులేదా కుంకుమతోనైనను పూజించవచ్చును.

ఓం చంచలాయై నమః పాదౌ పూజయామి; ఓం చపలాయై నమః జానునీ పూజయామి; ఓం పీతాంబరధరాయై నమః ఊరూం పూజయామి; ఓం కమలవాసిన్యై నమః కటిం పూజయామి; ఓం పద్మాలయాయై నమః నాభిం పూజయామి; ఓం మదనమాత్రే నమః స్తనౌ పూజయామి; ఓం లలితాయై నమః భుజద్వయం పూజయామి; ఓం కంబుకంఠ్యై నమః కంఠం పూజయామి; ఓం సుముఖాయై నమః ముఖం పూజయామి; ఓం శ్రియై నమః ఓష్ఠౌ పూజయామి; ఓం సునాసికాయై నమః నాసికాం పూజయామి; ఓం సునేత్రై నమః నేత్రం పూజయామి; ఓం రమాయై నమః కర్ణౌ పూజయామి; ఓం కమలాయై నమః శిరః పూజయామి; ఓం వరలక్ష్మ్యై నమః సర్వాంణ్యంగాని పూజయామి.

పిమ్మట 108 నామములు కల లక్ష్మీ అష్టోత్తర శతనామావళితో ప్రతి నామమునకు అక్షతలు లేదా పసుపు లేదా కుంకుమను దేవిపై వేస్తూ ఒక్కొక్క మంత్రమును చదువవలెను.

**శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామావళిః**

ఓం ప్రకృత్యై నమః ఓం లోకశోకవినాశిన్యై నమః ఓం ప్రీతిపుష్కరిణ్యై నమః
ఓం వికృత్యై నమః ఓం ధర్మనిలయాయై నమః ఓం శాంతాయై నమః
ఓం విద్యాయై నమః ఓం కరుణాయై నమః ఓం శుక్లమాల్యాంబరాయై నమః
ఓం సర్వభూతహితప్రదాయై నమః ఓం లోకమాత్రే నమః40 ఓం శ్రియై నమః
ఓం శ్రద్ధాయై నమః ఓం పద్మప్రియాయై నమః ఓం భాస్కర్యై నమః
ఓం విభూత్యై నమః ఓం పద్మహస్తాయై నమః ఓం బిల్వనిలయాయై నమః
ఓం సురభ్యై నమః ఓం పద్మాక్ష్యై నమః ఓం వరారోహాయై నమః
ఓం పరమాత్మికాయై నమః ఓం పద్మసుందర్యై నమః ఓం యశస్విన్యై నమః 80
ఓం వాచ్యై నమః ఓం పద్మోద్భవాయై నమః ఓం వసుంధరాయై నమః
ఓం పద్మాలయాయై నమః 10 ఓం పద్మముఖ్యై నమః ఓం ఉదారాంగాయై నమః
ఓం పద్మాయై నమః ఓం పద్మనాభప్రియాయై నమః ఓం హరిణ్యై నమః
ఓం శుచ్యై నమః ఓం రమాయై నమః ఓం హేమమాలిన్యై నమః
ఓం స్వాహాయై నమః ఓం పద్మమాలాధరాయై నమః ఓం ధనధాన్యకర్త్యై నమః
ఓం స్వధాయై నమః ఓం దేవ్యై నమః 50 ఓం సిద్ధ్యై నమః
ఓం సుధాయై నమః ఓం పద్మిన్యై నమః ఓం స్త్రైణసౌమ్యాయై నమః
ఓం ధన్యాయై నమః ఓం పద్మగంధిన్యై నమః ఓం శుభప్రదాయై నమః
ఓం హిరణ్మయై నమః ఓం పుణ్యగంధాయై నమః ఓం నృపవేశ్మగతానందాయై నమః
ఓం లక్ష్మ్యై నమః ఓం సుప్రసన్నాయై నమః ఓం వరలక్ష్మ్యై నమః 90
ఓం నిత్యపుష్టాయై నమః ఓం ప్రసాదాభిముఖ్యై నమః ఓం వసుప్రదాయై నమః
ఓం విభావర్యై నమః 20 ఓం ప్రభాయై నమః ఓం శుభాయై నమః
ఓం ఆదిత్యై నమః ఓం చంద్రవదనాయై నమః ఓం హిరణ్యప్రాకారాయై నమః
ఓం దిత్యై నమః ఓం చంద్రాయై నమః ఓం సముద్రతనయాయై నమః
ఓం దీప్తాయై నమః ఓం చంద్రసహోదర్యై నమః 60 ఓం జయాయై నమః
ఓం వసుధాయై నమః ఓం చతుర్భుజాయై నమః ఓం మంగళాదేవ్యైనమః
ఓం వసుధారిణ్యై నమః ఓం చంద్రరూపాయై నమః ఓం విష్ణువక్షస్థలస్థితాయై నమః
ఓం వసుధాయై నమః ఓం చతుర్భుజాయై నమః ఓం మంగళాదేవ్యైనమః

ఓం కాంతాయై నమః ఓం ఇందుశీతలాయై నమః ఓం ప్రసన్నాక్ష్యై నమః

ఓం కామాక్ష్యై నమః ఓం ఆహ్లాదజనన్యై నమః ఓం నారాయణసమాశ్రితాయై నమః100

ఓం క్రోధసంభవాయై నమః 30 ఓం పుష్ట్యై నమః ఓం దారిద్ర్యధ్వంసిన్యై నమః

ఓం అనుగ్రహప్రదాయై నమః ఓం శివాయై నమః ఓం దేవ్యై నమః

ఓం బుద్ధ్యై నమః ఓం శివకర్త్యై నమః ఓం సర్వోపద్రవవారిణ్యై నమః

ఓం అనఘాయై నమః ఓం సత్యై నమః ఓం నవదుర్గాయై నమః

ఓం హరివల్లభాయై నమః ఓం విమలాయై నమః ఓం మహాకాళ్యై నమః

ఓం అశోకాయై నమః ఓం విశ్వజనన్యై నమః 70 ఓం బ్రహ్మవిష్ణుశివాత్మికాయై నమః

ఓం అమృతాయై నమః ఓం పుష్ట్యై నమః ఓం త్రికాలజ్ఞానసంపన్నాయై నమః

ఓం దీప్తాయై నమః ఓం దారిద్ర్యనాశిన్యై నమః ఓం భువనేశ్వర్యై నమః 108

**లక్ష్మీ అష్టోత్తర శతనామ పూజాం సమర్పయామి.**

ధూపం : శ్లో॥ దశాంగం గగ్గులోపేతం సుగంధంచ మనోహరం,

ధూపం గృహాణ కల్యాణి భక్తిత్వం ప్రతిగృహ్యతామ్ ॥

**శ్రీ వరలక్ష్మీ దేవతాయైనమః** ధూపం సమర్పయామి అని రెండు అగరువత్తులను తీసుకొని వెలిగించి ధూపమును దేవికి చూపించవలెను. సాంబ్రాణి పొగను కూడ వేయవచ్చును.

దీపం : శ్లో॥ ఘృతావర్తి సంయుక్తం మంధకార వినాశకం

దీపం దాస్యామి తే దేవి గృహాణ ముదితా భవ

**శ్రీ వరలక్ష్మీ దేవతాయైనమః** దీపం సమర్పయామి అని వెలుగుతున్న దీపమును (రెండు అడ్డవత్తులు, ఒక కుంభ వత్తి వున్న రెండవ కుందిలో నూనె వేసి కర్పూర హారతి పళ్లెములోవెలుగుతున్నదీపముతోవెలిగించిఆదీపమునువెలిగించిదేవికి చూపించవలెను.

నైవేద్యం : శ్లో॥ నైవేద్యం షడ్రసోపేతం దధిమధ్వాజ్య సంయుతం

నానాభక్ష్యఫలోపేతం గృహాణ హరివల్లభే.

**శ్రీ వరలక్ష్మీ దేవతాయైనమః** నైవేద్యం సమర్పయామి అని దేవికి ప్రత్యేకించి చేసిన రకరకముల పిండివంటలు, పాయసం, పానకం (శుద్ధమైన నీటిలో బెల్లం, ఏలక్కాయపొడి, మిరియాలపొడి కలుపవలెను) వడపప్పు (శుభ్రము చేసి నీటితో నానబెట్టి నానిన పప్పును విడిగా తీసి పెట్టుకొనవలెను)

మరియు మహానైవేద్యం కొరకు చేసిన అన్నం, నెయ్యి, పప్పు, కూరలు మొ॥వి పూజ వద్ద పెట్టి మహానైవేద్యం దేవికి నమస్కరించవలెను. పళ్ళు, కొబ్బరికాయ మొదలగునవి కూడ దేవివద్దనుంచి పువ్వుతో నీళ్లు చల్లుతూ ఎడమచేత్తో గంటవాయిస్తూ 'ఓం ప్రాణాయ స్వాహా, ఓం అపానాయస్వాహా, ఓం వ్యానాయస్వాహా, ఓం ఉదానాయ స్వాహా, ఓం సమానాయ స్వాహా, ఓం శ్రీ వరలక్ష్మీదేవతాయైనమః నైవేద్యం సమర్పయామి'అంటూ ఆరుమార్లు చేతితో (చేతిలోని ఉద్ధరిణితో) స్వామికి నివేదనం చూపించాలి. పిదప నైవేద్యానంతరం 'హస్తౌ ప్రక్షాళయామి'అని ఉద్ధరిణెతో పంచపాత్రలోని నీరు ముందు చెప్పిన అర్ఘ్యపాత్ర (పంచపాత్ర కాకుండా విడిగా చెంబులో పెట్టుకొనే నీళ్ల పాత్ర) లో వదలాలి. తరువాత 'పాదౌప్రక్షాళయామి'అని మరోసారి నీరు అర్ఘ్య పాత్రలో ఉద్ధరిణెతో వదలాలి. పునః శుద్ధాచమనీయం సమర్పయామి అని ఇంకొక పర్యాయం నీరు వదలాలి తదనంతరం ....

పానీయం : శ్లో॥ ఘనసారసుగంధేన మిశ్రితం పుష్పవాసితం, పానీయం గృహ్యతాం దేవి శీతలం సుమనోహరం.

శ్రీ వరలక్ష్మీ దేవతాయైనమః పానీయం సమర్పయామి అని భోజనం అయిన తరువాత త్రాగుటకు నీరు ఇచ్చినట్లు భావించి కుడిచేత్తో నీటిని చూపుతూ ఎడమచేత్తో గంట వాయించవలెను.

తాంబూలం : శ్లో॥ పూగీఫలసమాయుక్తం నాగవల్లీ దళైర్యుతం,
కర్పూరచూర్ణ సంయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతాం.

శ్రీ వరలక్ష్మీ దేవతాయైనమః తాంబూలం సమర్పయామి అని తాంబూలమును అనగా మూడు తమలపాకులు, రెండు పోకచెక్కలు వేసి దేవివద్ద ఉంచాలి. తాంబూలం వేసుకున్నాకనోరుకడుక్కొనుటకునీరుఇస్తున్నామనితలుస్తూ,'తాంబూలచరవణానంతరం శుద్ధ ఆచమనీయం సమర్పయామి'అంటూ ఉద్ధరిణెతో నీరు అర్ఘ్యపాత్రలో వదలాలి. పిమ్మట కర్పూరం వెలిగించి......ఎడమచేత్తో గంట వాయిస్తూ కుడిచేత్తో హారతి పళ్లెం పట్టుకుని త్రిప్పుతూ శ్రీ వరలక్ష్మీదేవికి హారతి ఇవ్వవలెను. హారతి పాటలు పాడవచ్చును. కర్పూరహారతిని ఒక ప్రక్కకు పెట్టి ఒక చుక్క పంచపాత్రలోని నీరు హారతి పళ్ళెంలో వేయవలెను.

మంత్రపుష్పం : శ్లో॥ పద్మాసనే పద్మకరే సర్వలోకైక పూజితే,
నారాయణప్రియే దేవి సుప్రీతో భవ సర్వదా॥

శ్రీ వరలక్ష్మీ దేవతాయైనమః మంత్రపుష్పం సమర్పయామి అని కొన్ని పువ్వులు, అక్షతలు చేతిలోనికి తీసుకొని, లేచి నిలబడి నమస్కరించి ఈ పువ్వులు, అక్షతలు దేవిపై వేసి కూర్చొనవలెను.

ప్రదక్షిణాన్ : శ్లో॥ యానికానిచ పాపాని జన్మాంతరకృతానిచ,
తానితాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదేపదే.

శ్రీ వరలక్ష్మీ దేవతాయైనమః ప్రదక్షిణం సమర్పయామి అని చేతిలో అక్షతలు, పువ్వులు తీసుకొని లేచి నిలబడి మూడు సార్లు ఆత్మప్రదక్షిణ చేసి (అనగా తమలో తాము చుట్టూ తిరిగి) దేవికి నమస్కరించి, సాష్టాంగ దండప్రణామం చేసి (అనగా మగవారు పూర్తిగా పడుకుని తలను నేలకు ఆన్చి, ఆడువారు మోకాళ్లపై పడుకుని కుడికాలు ఎడమకాలుపై వేసి) తరువాత దేవిపై చేతిలోనున్న అక్షతలు, పువ్వులు చల్లవలెను.

నమస్కారాన్ : శ్లో॥ నమస్త్రైలోక్య జనని నమస్తే విష్ణువల్లభే,
పాహిమాం భర్తవరదే వరలక్ష్మై నమోనమః.
చతుర్దశ సువిద్యాసు రమతే యా సరస్వతీ,

శ్రీవరలక్ష్మీ దేవతాయైనమః నమస్కారాన్ సమర్పయామి అని మనస్ఫూర్తిగా దేవికి నమస్కరించవలెను. పిమ్మట చేసివుంచుకున్న తోరములను ఒక పళ్ళెములో పెట్టి పసుపు, కుంకుమ, అక్షతలతో పూజించవలెను. తొమ్మిది వరుసలు, తొమ్మిది ముడులు కలిగిన తోరమును తొమ్మిది (నవమ గ్రంథిం) నామములతో పూజిస్తారు.

అథ తోరగ్రంథి పూజా

ఓం కమలాయై నమః ప్రథమగ్రంథిం పూజయామి
ఓం రమాయై నమః ద్వితీయగ్రంథిం పూజయామి
ఓం లోకమాత్రే నమః తృతీయగ్రంథిం పూజయామి
ఓం విశ్వజనన్యై నమః చతుర్థగ్రంథిం పూజయామి
ఓం మహాలక్ష్మ్యై నమః పంచమగ్రంథిం పూజయామి
ఓం క్షీరాబ్ధితనయాయై నమః షష్టమగ్రంథిం పూజయామి
ఓం విశ్వసాక్షిణ్యై నమః సప్తమగ్రంథిం పూజయావి

# వరలక్ష్మీ వ్రతకల్పము

ఓం చంద్రసోదర్యై నమః అష్టమగ్రంథిం పూజయామి

ఓం హరివల్లభాయై నమః నవమగ్రంథిం పూజయామి

**తోరబంధన మంత్రం**

బధ్నామి దక్షిణేహస్తే నవసూత్రం శుభప్రదం,

పుత్రపౌత్రాభివృద్ధించ సౌభాగ్యం దేవి మే రమే.

తోరమును కట్టుకుంటూ ఈ శ్లోకమును చదివి కుడిచేతికి తోరమును కట్టి తోరమునకు పసుపు, కుంకుమ అద్దవలెను.

వాయన విధి

ఏవం సంపూజ్య కల్యాణీం వరలక్ష్మీం స్వశక్తితః,

దాతవ్యం ద్వాదశాపూపం వాయనం హి ద్విజాతయే.

వాయనదాన మంత్రః

ఇందిరాప్రతిగృహ్ణాతు ఇందిరా వై దదాతి చ,

ఇందిరా తారకోభాభ్యాం ఇందిరాయై నమో నమః

శ్రీవరలక్ష్మీదేవతాయైనమఃవాయనదానంసమర్పయామిఅనుకొనిశనగలు (నానబెట్టినవి), తాంబూలం (3 ఆకులు, వక్క, అరటిపండు), రవికల (జాకెట్టు) గుడ్డ, పువ్వులు మరియు తయారుచేసిన పిండివంటలను ఒక పళ్లెములోనికి 9 రకములు రకమునకు 9 వంతునగాని (లేదా ఎవరి శక్తి అనుసారముగా వారు) తీసుకొని మరొక పళ్లెముతో మూసి పైన కొంగును కప్పి ముత్తైదువకు బొట్టు పెట్టి ఆమెను వరలక్ష్మీదేవిగా భావించి ఈ వాయనమును అందిస్తూ ఇచ్చువారు ఇస్తినమ్మ వాయనం అని, పుచ్చుకొనువారు పుచ్చుకొంటినమ్మ వాయనం అనాలి ఈవిధంగా మూడుసార్లును, నా వాయనం అందుకొన్నదెవరు అని ఇచ్చేవారు, నేనమ్మా వరలక్ష్మీదేవిని అని పుచ్చుకొనేవారు అనాలి ఈవిధంగా మూడుసార్లును, అడిగితె వరం అని ఇచ్చువారు, ఇస్తి వరం అని పుచ్చుకొనువారు మూడుసార్లు అనాలి. ఈవిధంగా వాయనమును దేవికి సమర్పించి నమస్కరించవలెను.

ఆరోజు సాయంత్రము ముత్తైదువలను పిలిచి పేరంటం చేసుకొనవచ్చును. (పేరంటం అనగా పసుపు, కుంకుమ, గంధం ముత్తైదువలకు ఇచ్చి శనగలు (నానబెట్టినవి), తాంబూలం (3 ఆకులు, వక్క, అరటిపండు), రవికల (జాకెట్టు) గుడ్డ, పువ్వులు ఇవ్వవలెను.

పునఃపూజ : ఓం శ్రీ వరలక్ష్మీదేవ్యైనమః పునఃపూజాంచ కరిష్యే అని చెప్పుకొని, పంచపాత్రలోని నీటిని చేతితో తాకి, అక్షతలు దేవిపై చల్లుతూ ఈక్రింది మంత్రములు చదువుకొనవలెను.

ఛత్రం ఆచ్ఛాదయామి, చామరం వీజయామి, నృత్యం దర్శయామి, గీతం శ్రావయామి. సమస్త రాజోపచార, శక్త్యోపచార, భక్త్యోపచార పూజాం సమర్పయామి అనుకొని, నమస్కరిస్తూ ఈక్రింది శ్లోకమును చదువుకొనవలెను.

ఏతత్ఫలం శ్రీ వరలక్ష్మీమాతార్పణమస్తు అంటూ అక్షతలు నీటితోపాటు అరవేణంలో వదలవలెను. పిమ్మట ' శ్రీవరలక్ష్మీదేవతా ప్రసాదం శిరసాగృహ్ణామి ' అనుకొని దేవివద్ద అక్షతలు తీసుకొని తమ తమ తలలపై వేసుకొనవలెను. ఆ పిదప పసుపు గణపతి ఉన్న పళ్లెము నొకసారి పైకి ఎత్తి తిరిగి క్రింద ఉంచి పళ్లెములో ఉన్న పసుపు గణపతిని తీసి దేవుని పీఠముపై నుంచవలెను. దీనిని ఉద్వాసన చెప్పటం అంటారు.

శ్లో॥ యస్య స్మృత్యాచ నోమోక్త్యాతపః పూజాక్రియాదిషు. న్యూనం సంపూర్ణతాం యాతి సద్యో వందేతమచ్యుతం మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం జనార్ధన, యత్పూజితం మయా దేవ పరిపూర్ణం తదస్తుతే, అనయా ధ్యాన ఆవాహనాది షోడశోపచార పూజాయా చ భగవాన్సర్వాత్మకః శ్రీ వరలక్ష్మీదేవతా సుప్రీతోవరదోభవతు, శ్రీవరలక్ష్మీ దేవతా ప్రసాదం శిరసాగృహ్ణామి.

**ఇతి పూజావిధానమ్ సంపూర్ణమ్.**

## వరలక్ష్మీ వ్రతకథా ప్రారంభము

సూతపౌరాణికుండు శౌనకుడు మొదలగు మహర్షులను చూచి యిట్లనియె : మునివర్యులారా! స్త్రీలకు సకల సౌభాగ్యములు కలుగునట్టి ఒక వ్రతరాజంబును పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పెను. దానిని చెప్పెదను వినుడు.

ఒకప్పుడు కైలాస పర్వతమున వజ్రములు, వైఢూర్యములు, మణులు మొదలగునవాటితో కూడిన సింహాసనమునందు పరమేశ్వరుడు కూర్చుండి యుండగా పార్వతీదేవి పరమేశ్వరునకు నమస్కరించి 'దేవా! లోకమున స్త్రీలు ఏ వ్రతము చేసినచో సర్వసౌభాగ్యములు, పుత్రపౌత్రాదులు కలిగి సుఖంబుగనుందురో అట్టి వ్రతము నాకు చెప్పుమనిన ఆ పరమేశ్వరుడు ఈవిధంగా పలికెను.

# వరలక్ష్మీ వ్రతకల్పము

'ఓ మనోహరీ! స్త్రీలకు పుత్రపౌత్రాది సంపత్తులను కలుగచేసెడి వరలక్ష్మీ వ్రతము అను ఒక వ్రతము కలదు. ఆ వ్రతమును శ్రావణ మాస శుక్రపక్ష పూర్ణిమకు ముందుగా వచ్చెడి శుక్రవారమునాడు చేయవలయు' ననిన పార్వతీదేవి యిట్లనియె.

'ఓ లోకారాధ్యా! నీ వానతిచ్చిన వరలక్ష్మీ వ్రతమును ఎట్లు చేయవలయును?
ఆ వ్రతమునకు విధియేమి? ఏ దేవతను పూజింపవలయును? పూర్వము ఎవరిచే
ఈ వ్రతము ఆచరింపబడినది? వీనినెల్ల వివరముగా చెప్పవలయు' నని ప్రార్థింపగా పరమేశ్వరుండు పార్వతీ దేవిని చూచి యిట్లనియె-'ఓ కాత్యాయనీ! వరలక్ష్మీ వ్రతము వివరముగ చెప్పెదను వినుము. మగధ దేశమున కుండినము అనునొక పట్టణము కలదు. ఆ పట్టణము బంగారు ప్రాకారంబులతోడను, బంగారు గోడలుగల ఇండ్లతోడను గూడియుండెను. అట్టి పట్టణమునందు చారుమతియను నొక బ్రాహ్మణ స్త్రీ గలదు.

ఆ వనితామణి పెనిమిటిని (భర్తని) దేవునితో సమానముగా తలచి ప్రతిదినమును ఉదయమున మేల్కొని స్నానముచేసి పుష్పములచే పెనిమిటిని (భర్తను) పూజచేసిన పిదప అత్తమామలకు అనేక విధములైన ఉపచారములు చేసి ఇంటిపనులను చేసికొని, గయ్యాళిగాక మితముగాను, ప్రియముగాను భాషించుచునుండెను.ఇట్లుండగా

ఆ మహాపతివ్రతయందు మహాలక్ష్మికి అనుగ్రహము కలిగి ఒకనాడు స్వప్నంబున ప్రసన్నయై 'ఓ చారుమతీ! నేను వరలక్ష్మీ దేవిని, నీయందు నాకు అనుగ్రహము గలిగి ప్రత్యక్షమైతిని. శ్రావణశుక్ల పూర్ణిమకు ముందుగా వచ్చెడు శుక్రవారము నాడు నన్ను సేవించినచో నీకు కోరిన వరములనిచ్చెద' నని వచించెను. చారుమతీదేవి స్వప్నములోనే వరలక్ష్మీ దేవికి ప్రదక్షిణ నమస్కారములు చేసి -

**శ్లో॥ నమస్తే సర్వలోకానాం జనన్యై పుణ్యమూర్తయే,**
**శరణ్యే త్రిజగద్వంద్యే విష్ణు వక్ష స్థలాలయే ॥**

అని అనేక విధముల స్తోత్రముచేసి 'ఓ జగజ్జననీ! నీ కటాక్షంబు గలిగెనేని జనులు ధన్యులుగను, విద్వాంసులుగను, సకల సంపన్నులుగను నయ్యెదరు. నేను నా జన్మాంతరమున చేసిన పుణ్య విశేషమువలన మీ పాదదర్శనము నాకు కలిగెనని నమస్కరించెను.

మహాలక్ష్మి సంతోషము చెంది చారుమతికి అనేక వరములిచ్చి అంతర్ధానంబు (అదృశ్యమయ్యెను) నొందెను.

# వరలక్ష్మీ వ్రతకల్పము

చారుమతి తక్షణంబున (వెంటనే) నిదుర మేల్కొని ఇంటికి నాల్గు ప్రక్కలం జూచి వరలక్ష్మీ దేవిని గానక 'ఓహో! మనము కలగంటి' మని, ఆ స్వప్న వృత్తాంతమును పెనిమిటి (భర్త) - మామగారు మొదలైనవారితో చెప్పగా, వారు 'ఈ స్వప్నము చాలా ఉత్తమమైనదని, శ్రావణ మాసము వచ్చినతోడనే వరలక్ష్మీ వ్రతమును తప్పక చేయవలసిన'దని చెప్పిరి.

పిమ్మట చారుమతీ దేవియును, స్వప్నంబును విన్న స్త్రీలును శ్రావణమాసము ఎప్పుడు వచ్చునాయని యెదురుచూచుచుండిరి. ఇట్లుండగా వీరి భాగ్యోదయంబున (అదృష్టమువలన) శ్రావణ మాస పూర్ణిమకు ముందుగ వచ్చెడి శుక్రవారము వచ్చెను. అంత చారుమతి మొదలగు స్త్రీలందరును 'ఈ దినమేకదా వరలక్ష్మీ దేవి చెప్పిన దినమ'ని ఉదయంబుననే మేల్కాంచి స్నానముచేసి శుభ్రమైన వస్త్రములను కట్టుకొని చారుమతీదేవి గృహమున ఒక ప్రదేశమునందు గోమయంబుచే (ఆవు పేడచే) అలికి మంటపమును ఏర్పరచి అందు ఒక ఆసనము వైచి దానిపై బియ్యముపోసి కలశం ఏర్పరచి అందు వరలక్ష్మీ దేవిని ఆవాహనమ చేసి చారుమతి మొదలగు స్త్రీలందరు మిగుల భక్తియుక్తులై సాయంకాలమున-

**శ్లో॥ పద్మాసనే పద్మకరే సర్వలోకైక పూజితే**

**నారాయణ ప్రియె దేవీ సుప్రీతా భవ సర్వదా ॥**

అనుశ్లోకముచేధ్యానావాహనాది షోడశోపచార పూజలను చేసి తొమ్మిది సూత్రములుగల తోరములను దక్షిణ హస్తమున (కుడిచేతియందు) కట్టుకొని వరలక్ష్మీదేవికి నానావిధ భక్ష్యభోజ్యంబులను (అన్నిరకముల పిండివంటలను) నైవేద్యము చేసి, ప్రదక్షిణము చేసిరి. ఇట్లొక ప్రదక్షిణము చేయగా నా స్త్రీలకందరికి కాళ్లయందు ఘల్లుఘల్లుమను నొక శబ్దము కలిగెను. అంత కాళ్లం జూచుకొనిన గజ్జెలు మొదలగు నాభరణములు కలిగియుండ చారుమతి మొదలగు స్త్రీలందరును 'ఓహో! ఇవి వరలక్ష్మీదేవి కటాక్షము వలన కలిగినవి'అని పరమానందమునొందిమరియొక ప్రదక్షిణము చేసిన హస్తములందు ధగద్ధగాయమానముగ మెరయుచుండు నవరత్న ఖచితములయిన కంకణములు మొదలగు ఆభరణములు ఉండుట చూచిరి. ఇంక చెప్పనేల ! మూడవ ప్రదక్షిణము చేసిన తోడనే ఆ స్త్రీలందరు సర్వభూషణ అలంకార భూషితలయి చారుమతి మొదలగుఆస్త్రీలగృహములనెల్లస్వర్ణమయములయి(బంగారముతోనిండి) రథగజతురగ (రథములు, ఏనుగులు, గుఱ్ఱములతో) వాహనములతోడ నిండియుండెను.

అంత ఆ స్త్రీలను తీసికొని గృహములకు పోవుటకు వారివారి యిండ్లనుండి గుఱ్ఱములు, ఏనుగులు, రథములు, బండ్లును వరలక్ష్మీ దేవిని పూజించుచుండు స్థలమునకు వచ్చి నిలిచియుండెను. పిదప చారుమతి మొదలగు స్త్రీలందరును తమకు కల్పోక్త ప్రకారముగ పూజ చేయించిన బ్రాహ్మణోత్తముని గంధపుష్పాక్షతలచే పూజించి పండ్రెండు కుడుములు, పాయస దానంబిచ్చి దక్షిణ తాంబూలముల నొసంగి నమస్కారము చేసి బ్రాహ్మణోత్తమునిచే ఆశీర్వాదంబునొంది వరలక్ష్మీదేవికి నివేదనము చేసిన భక్ష్యాదులను బంధువులతోడ ఎల్లరును భుజించి, తమకొరకు వచ్చి కాచుకొనియున్న గుఱ్ఱములు, ఏనుగులు మొదలగు వాహనముల నెక్కి తమ తమ ఇళ్లకు పోయిరి. అపుడు వారు ఒకరితో నొకరు 'ఆహా! చారుమతీదేవి భాగ్యం బేమని చెప్పవచ్చును. వరలక్ష్మీ దేవి తనంతట తానే స్వప్నములో వచ్చి ప్రత్యక్షమయ్యెను. ఆ చారుమతీదేవి వలననే గదా మనకిట్టి మహాభాగ్య సంపత్తులు గలిగె'నని చారుమతీ దేవిని మిక్కిలి పొగడుచు తమ తమ ఇండ్లకు పోయి చేరిరి. నాటినుండియు చారుమతి మొదలగు స్త్రీలందరును ప్రతి సంవత్సరము ఈ వ్రతంబు చేయుచు పుత్రపౌత్రాభివృద్ధి కలిగి ధనకనక వస్తు వాహనముల తోడ గూడుకొని సుఖంబుగ నుండిరి.

కావున ఓ పార్వతీ! యీ ఉత్తమమైన వ్రతమును బ్రాహ్మణాది నాలుగు జాతులవారును చేయవచ్చును. అటు లొనర్చిన సర్వ సౌభాగ్యములు కలిగి సుఖముగనుందురు.

ఈ కథను వినువారలకు, చదువువారలకు వరలక్ష్మీ ప్రసాదము వలన సకల కార్యంబులు సిద్ధించును.

ఆ చారుమతీదేవి చేసిన వ్రతమును లోకమంతా చేశారు. లోకమంతా చేసిన వ్రతమును మనమూ చేశాము. వ్రతలోపమైనా కథ లోపం కారాదు. భక్తి తప్పినా ఫలం తప్పరాదు , సర్వేజనాఃసుఖినోభవంతు అని నమస్కారము చేయవలెను.

ఇది భవిష్యోత్తర పురాణమునందు పార్వతీ పరమేశ్వర
సంవాదమైన వరలక్ష్మీ వ్రతకల్ప కథా సంపూర్ణము.